సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



అక్రమార్కుల ఆటకట్టు

అసైన్డ్ భూమిలో అక్రమంగా తవ్వకాలకు పాల్పడిన ఎనిమిది మందిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 10లో▸



వాహన సేవలు

చేవెళ్లలోని బాలాజీ శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 10లో▸



కూల్చివేతలకు బ్రేక్!

మూసీ పరీవాహకం పరిధిలోని నివాసాల కూల్చివేతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. 10లో▸

న్యూస్‌రీల్

చిలుకూరు బాలాజీని దర్శించుకున్న సబితారెడ్డి



స్వామివారి సన్నిధిలో సబితారెడ్డి కుటుంబ సభ్యులు, ఇతర నాయకులు

మొయినాబాద్: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి కుటుంబ సమేతంగా చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. సోమవారం ఆమె చిన్న కుమారుడు కళ్యాణ్‌రెడ్డి దంపతులతో కలిసి చిలుకూరు బాలాజీ ఆలయానికి చేరుకున్నారు. గర్భగుడిలోకి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ సబితారెడ్డి కుటుంబ సభ్యులకు ఆశీర్వాదం అందించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, సీనియర్ నాయకుడు కొత్త నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ కొత్త మాణిక్‌రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహగౌడ్, మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్, నాయకులు ఆంద్రూ, సురేందర్‌గౌడ్, జీఎన్ రాజు, చెన్నయ్య, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు



తుక్కుగూడ: మున్సిపల్ కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి స్కేటింగ్ ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పోటీల్లో తలపడుతున్నారు. సోమవారం 15కే, 10కే, 500 మీటర్ల పోటీలు నిర్వహించారు. బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి హాజరై క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. రాష్ట్రంవ్యాప్తంగా 400 మందికి పైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆర్.రామకృష్ణ, గోపాల్‌రెడ్డి, విఠల్, అబ్బాస్, అజయ్, యాదయ్య, సత్యం, శ్రీశైలం పాల్గొన్నారు.

ప్రజావాణికి నిరసన సెగ




శ్మశానవాటిక భూమిని కాపాడాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న స్థానికులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి నిరసన సెగ తగిలింది. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం కార్యక్రమాన్ని యథావిధిగా ప్రారంభించారు. కలెక్టర్ శశాంక, డీఆర్‌ఓ సంగీత సహా పలువురు జిల్లా స్థాయి అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. అదే సమయంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ పరిధిలోని సర్వే నంబర్ 212లో శ్మశానవాటిక భూమిని కాపాడాలని డిమాండ్ చేస్తూ సుందరయ్య కాలనీ, ఇందిరమ్మకాలనీ, లక్ష్మీనగర్ కాలనీలకు చెందిన ప్రజలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కై.. ఫిర్యాదులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే రూ.ఐదు లక్షల నిధులతో శ్మశానవాటిక చుట్టూ కాంపౌండ్ వాల్‌ను నిర్మించాల్సిందిగా ఆదేశించారు. అనంతరం 57 మంది నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని త్వరగా పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

అబ్దుల్లాపూర్‌మెట్: డ్రాగన్ ఫ్రూట్ రైతుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా డ్రాగన్ ఫ్రూట్ రైతుల సమాఖ్య అధ్యక్షుడు, జాతీయ హార్టికల్చర్ బోర్డు మెంబర్ వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అధ్వర్యంలో సోమవారం బాటసింగారంలోని మార్కెట్ కార్యాలయంలో మధుసూదన్‌రెడ్డిని కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎవరికి వారే!



గ్రూపులుగా విడిపోయిన కాంగ్రెస్ నాయకులు

- పాత, కొత్త నేతల మధ్య కొరవడిన సమన్వయం
- పట్టుకోసం ఎవరికి వారు ప్రయత్నాలు
- నివురుగప్పిన నిప్పులా అంతర్గత విభేదాలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: అధికార కాంగ్రెస్ పార్టీ పరిస్థితి జిల్లాలో 'హస్త'వ్యస్తంగా తయారైంది. పాత, కొత్త నేతల మధ్య సమన్వయ లోపం.. క్షేత్రస్థాయిలోని లీడర్లు ఎవరికి వారే వర్గాలుగా విడిపోవడం కేడర్‌లో అయోమయానికి కారణమవుతోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో పార్టీ పరిస్థితి మెరుగుపడకపోగా రోజురోజుకూ మరింత దిగజారుతుండటాన్ని సగటు కార్యకర్త జీర్ణించుకోలేక పోతున్నాడు. అసెంబ్లీ ఎన్నికలకు ముందున్న ఆదరణ..ప్రస్తుతం పార్టీపై ప్రజల్లో కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పటికప్పుడు వార్డు, డివిజన్, మండల, మున్సిపాలిటీ స్థాయి ముఖ్య నేతలతో సమావేశమై.. కేడర్‌ను ఒక్కతాటిపైకి తేవాల్సిన పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తెలంగాణ పట్టణ మౌలిక సదుపాయాలు, ఆర్థిక సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కేడర్‌కు పెద్దగా అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు లేకపోలేదు. జిల్లాకు ఎవరైనా మంత్రులు, ఇతర ముఖ్య నేతలు వచ్చినప్పుడు మినహా.. పార్టీ కార్యక్రమాల్లోనూ, ప్రజల్లో పెద్దగా కనిపించచడం లేదు. జిల్లా, మండల, మున్సిపాలిటీ స్థాయిలో కొత్త కమిటీలు కూడా వేయలేదు. దీంతో క్షేత్రస్థాయి నేతలు ఎవరికి వారే అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

టీకేఆర్ ప్రకటనతో కలకలం

కాంగ్రెస్‌కు కంచుకోట లాంటి మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీ కేడర్ నాలుగు వర్గాలుగా విడిపోయింది. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన పటోళ్ల సబితారెడ్డి కూడా ఆర్వాత బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరనున్నారనే ప్రచారం జరిగింది. అప్పటికే నియోజకవర్గంలో పాగా వేసిన మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్‌ఆర్).. ఢిల్లీ స్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చి..ఆమెను పార్టీలోకి రాకుండా నిలువరించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గేట్లు మూసివేయడంతో ఆమె బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇటు చేవెళ్ల, అటు రాజేంద్రనగర్, మహేశ్వరం ఇలా మూడు నియోజకవర్గాల్లో పట్టు కోసం ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే తన కుమారుడు కార్తీక్‌రెడ్డిని రాజేంద్రనగర్‌లో తిప్పుతున్నారు. ఇటీవలి ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ ఆ తర్వాత నియోజకవర్గ ఇన్‌చార్జిగా పార్టీలో పట్టు సాధించారు. ఇటు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, అటు బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి వర్గాలుగా విడిపోయారు. ఎవరికి వారు అంతర్గత పట్టుకోసం పోటీపడుతున్నారు. ఈ పోటీలో టీకేఆర్, ఆయన కోడలు మాజీ జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి ఇమడలేక పోతున్నారు. పార్టీలో తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ఏకపక్షంగా వ్యవహరిస్తూ రాజకీయంగా తమను అణగదొక్కేందుకు యత్నిస్తున్నారని సన్నిహితుల వద్ద టీకేఆర్ వాపోయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. తాజాగా ఆయన ఏపీ సీఎం చంద్రబాబు నివాసానికి చేరుకోవడం, త్వరలోనే టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. టీకేఆర్‌ను నిలువరించే ప్రయత్నం కూడా పార్టీ పెద్దలు చేయకపోవడం విశేషం.

చేరికలతో మారిన సీన్

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ రాష్ట్రవ్యాప్తంగా సత్తా చాటినా.. గ్రేటర్ జిల్లాల్లో పెద్దగా ప్రభావం చూపలేక పోయింది. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి, షాద్‌నగర్ మినహా మిగిలిన చోట ఖాతా తెరవలేక పోయింది. తీరా ఎన్నికల తర్వాత అప్పటికే బీఆర్‌ఎస్ బీఫాంపై గెలుపొందిన ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా వచ్చి కాంగ్రెస్‌లో చేరారు. వీరిలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు ఉన్నారు. మరికొంత మంది ఎమ్మెల్యేలు కూడా సీఎం రేవంత్‌తో టచ్‌లో ఉన్నట్లు సమాచారం. ఎన్నికలు ముగిసిన కొద్ది రోజులకే ఇతర పార్టీలో గెలుపొందిన ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, సర్పంచులు, ఇతర ముఖ్య నేతలు ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరారు. అప్పటికే స్థానికంగా బలమైన కాంగ్రెస్ నేతలుగా ముద్రపడిన సెకండ్ కేడర్ లీడర్లు వీరి రాకను జీర్ణించుకోలేకపోయారు. పదేళ్ల తర్వాత పార్టీ అధికారంలోకి రావడం, సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి ముఖ్య నేతలను పిలిచి మాట్లాడటంతో సమస్య బయటికి రాలేదు. త్వరలో పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించనుండటంతో అంతర్గతంగా ఉన్న గ్రూపు రాజకీయాలు ఒక్కసారిగా బయటికి వస్తున్నాయి. మహేశ్వరం నియోజకవర్గంలో నాలుగు వర్గాలు, రాజేంద్రనగర్‌లో మూడు, శేరిలింగంపల్లిలో రెండు, చేవెళ్లలో రెండు వర్గాలుగా పార్టీ విడిపోయింది. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోనూ రెండు గ్రూపులుగా విడిపోవడం గమనార్హం. పాత, కొత్త నేతలను సమన్వయం చేసే వ్యవస్థ లేకపోవడం కూడా పార్టీలో అంతర్గత విభేదాలు మరింత ముదరడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

దేశానికి రోల్ మోడల్‌గా

కొత్త రెవెన్యూ చట్టం

- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన
- ప్రతీ నియోజకవర్గానికి 4వేల ఇందిరమ్మ ఇళ్లు
- ఎన్నికల హామీలన్నీ నెరవేర్చి తీరుతాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- కడ్తాల్‌లో తహసీల్దార్ నూతన కార్యాలయ భవనం ప్రారంభం



తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: దేశానికి రోల్ మోడల్ నిలిచే కొత్త ఆర్‌ఓఆర్ చట్టాన్ని తీసుకురాబోతున్నామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్మించిన నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ విధానాలను విశ్వసించి అధికారం కట్టబెట్టిన ప్రజలకు అనుగుణంగా రెవెన్యూ వ్యవస్థను తీర్చిదిద్దుతామన్నారు. సామాన్యుడికి సైతం రెవెన్యూ సేవలను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ధరణి పోర్టల్‌తో పాటు, గత ప్రభుత్వ వైఖరితో భూ యాజమానులు అభద్రతాభావానికి లోనయ్యారని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ధరణి పోర్టల్‌ను పూర్తిగా తొలగించి, కొత్త రెవెన్యూ చట్టం తెస్తామన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటీ నెరవేరుస్తామని స్పష్టం చేశారు. రూ.7.19 లక్షల కోట్ల అప్పులు చేసిన గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని మండిపడ్డారు. వీటికి వడ్డీ కట్టలేని పరిస్థితిలో కూడా రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం పంట రుణాలు మాఫీ చేశామన్నారు. అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షలు మాఫీ చేసి తీరుతామన్నారు. 2004 నుంచి 2014 వరకు పదేళ్ల కాలంలో 17.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను కట్టించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. ఈనెల చివరిలోపు మొదటి విడతగా ప్రతీ నియోజకవర్గానికి 3,500 నుంచి 4 వేల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని ప్రకటించారు. ఇళ్ల స్థలం లేని వారికి రెండో విడతలో ఇంటి స్థలంతో పాటు, రూ.5 లక్షలతో ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ప్రతీ కుటుంబానికి స్మార్ట్ కార్డు అందజేసి సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని తెలిపారు.

అభివృద్ధికి సహకరించాలి..

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకర్గ అభివృద్ధికి పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసి, అభివృద్ధికి సహకరించాలని కోరారు. నాలుగు మండలాలకు కలిపి ఆర్డీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మంత్రి దృష్టికి తెచ్చారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. జిల్లాలో వక్ఫ్, ఇనాం భూములకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని అన్నారు. జిల్లాలో 3 వేలకు పైగా ఉన్న ధరణ సమస్యలను 500కు తగ్గించినట్లు తెలిపారు. టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని అన్నారు. అనంతరం గీత కార్మికులకు కాటమయ్య కిట్లు, మహిళలకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ ముంతాజ్, ప్రత్యేకాధికారి రామేశ్వరిదేవి, పీసీసీ సభ్యులు బాలాజీసింగ్, శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, ఎంపీడీవో సుజాత తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

రిసార్ట్, కన్వెన్షన్‌లపై ఎక్సైజ్ దాడి

- 75 మద్యం బాటిళ్లు స్వాధీనం
- నిర్వాహకులపై కేసు నమోదు

మొయినాబాద్: ఎలాంటి అనుమతులు లేకుండా ఈవెంట్స్ నిర్వహిస్తూ మద్యం వినియోగిస్తున్న రిసార్ట్, కన్వెన్షన్లపై శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. 75 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. ఈ సంఘటన మొయినాబాద్ మండలంలోని వెంకటాపూర్‌లో చోటుచేసుకుంది. శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఉన్న రెయిన్‌బో రిసార్ట్స్‌లో ఆదివారం రాత్రి 30 మందితో ఈవెంట్ నిర్వహించారు. ఒక్కొక్కరి నుంచి రూ.4,999 వసూలు చేసి ఎక్సైజ్ శాఖ అనుమతులు లేకుండా పాండిచ్చేరికి చెందిన మద్యం వినియోగించారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు రిసార్ట్స్‌పై దాడి చేసి 53 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతంలోని అవిన్య కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఈవెంట్‌లో ఎలాంటి అనుమతి లేకుండా మద్యం వినియోగిస్తుండడంతో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి 22 ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా మద్యం వినియోగిస్తున్న ఈవెంట్ నిర్వాహకులతోపాటు రిసార్ట్, కన్వెన్షన్ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.

గోప్యంగా ఉంచుతున్న ఎక్సైజ్ పోలీసులు

రిసార్ట్స్, ఫాంహౌస్‌లలో ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా మద్యం వినియోగిస్తున్నా చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. రిసార్ట్స్, ఫాంహౌస్‌లు, కన్వెన్షన్ల నుంచి మామూళ్లు తీసుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు రిసార్ట్స్, కన్వెన్షన్‌పై దాడి చేసి అనుమతి లేకుండా వినియోగిస్తున్న మద్యాన్ని పట్టుకున్న విషయాన్ని సైతం గోప్యంగా ఉంచారు. కేసు వివరాలకోసం ఫోన్ చేస్తే స్పందించలేదు.

ఢీకొట్టి.. దూసుకెళ్లి

- రెండు ప్రాణాలను బలిగొన్న లారీడ్రైవర్ నిర్లక్ష్యం
- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



అన్నోజు శ్రవణ్ కుమార్ (ఫైల్)



మదీనా బాషా (ఫైల్)

మీర్‌పేట: ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం, అజాగ్రత్త రెండు నిండు ప్రాణాలను బలితీసుకుంది. ఉద్యోగానికి వెళ్తూ ఒకరు, విధులు ముగించుకుని ఇంటికి వెళ్తూ లిఫ్ట్ అడిగిన మరొకరు మృత్యు ఒడికి చేరారు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మీర్‌పేట టీకేఆర్ కళాశాల వద్ద నివసించే మదీనా బాషా (42) ఉప్పల్ ఫీర్జాదిగూడలోని టీజీ ఆర్టీసీ వర్క్‌షాపులో అసిస్టెంట్ ఇంజినీర్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 7.30 గంటలకు తన ద్విచక్ర వాహనంపై ఉద్యోగానికి వెళ్తుండగా నందనవనంలో నివసిస్తూ టీకేఆర్ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న అన్నోజు శ్రవణ్‌కుమార్ (40) లిఫ్ట్ అడిగాడు. ఇద్దరూ కలిసి వాహనంపై టీకేఆర్ కళాశాల నుంచి నందనవనం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో తిరుపతి రేణిగుంట నుంచి దుంగల లోడ్‌తో వచ్చిన లారీ (ఏపీ 20టీబీ 1299) రాఘవేంద్ర వే బ్రిడ్జి వద్ద వెయిట్ చేసుకుని తిరిగి వెళ్తోంది. నందనవనం శ్మశానవాటిక వద్దకు రాగానే లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడిపి ద్విచక్ర వాహనంపై ముందు వెళ్తున్న బాషా, శ్రవణ్‌కుమార్‌ను ఢీకొట్టి వారిపై నుంచి దూసుకెళ్లాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వారు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్రవణ్‌కుమార్ భార్య అనూరాధ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులు బాషా, శ్రవణ్‌కుమార్‌కు ఇద్దరు, ఇద్దరు పిల్లలు ఉన్నారని సీఐ తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాండు



కలెక్టర్ శశాంకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

ఇబ్రహీంపట్నం రూరల్: పండగ పూట పంచాయతీ సిబ్బంది వేతనాలు చెల్లించకుండా పస్తులుండాలా అని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు ప్రశ్నించారు. పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, డంపింగ్ యార్డు, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాల్లో పని చేస్తూ అనారోగ్యాలకు గురై ప్రజలకు సేవలందస్తున్నారని తెలిపారు. చాలీచాలని జీతాలతో కాలం వెళ్లదీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నైపుణ్యం లేక పని చేసే క్రమంలో ప్రమాదాలు జరిగి చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేస్తే ప్రజాపాలన పేరుతో పది నెలలు గడుస్తున్నా కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. అనుభవం ఉన్న వారిని విలేజ్ వాటర్ అసిస్టెంట్లుగా నియమించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. అనంతరం కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పోచమోని కృష్ణ, పెంటయ్య, బాల్‌రాజ్, జగన్, కృష్ణ, జంగయ్య, రవనీల, ఆశీర్వాదం, సాలమ్మ, అండాలు, లలిత, గాలయ్య, సునీత, సురేష్, యాదయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ కార్డుల సర్వే పరిశీలన

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కుటుంబ డిజిటల్ కార్డుల జారీ కోసం ఈ నెల 3న ప్రారంభమైన సర్వేను సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయ ప్రధాన కార్యదర్శి అజిత్ రెడ్డి కలెక్టర్ శశాంకతో కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్‌లోని 61వ వార్డులో పరిశీలించారు. సర్వేలో వస్తున్న సమస్యలను సర్వేయర్లు, నోడల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లాలోని ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో నియమించిన నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన సర్వేలో వచ్చిన సమస్యలు, ఆన్‌లైన్ ఫార్మ్ ప్రిపరేషన్, ఆధార్ కార్డ్ కుటుంబ సభ్యుల సేకరణలో కలిగిన ఇబ్బందులపై ఆరా తీశారు. సమావేశంలో చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత రెడ్డి, రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నోడల్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శశాంక



ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కేపీవీ రాజు, చిత్రంలో నిందితుడు

చెప్పేది పాఠాలు.. చేసేది లూటీలు!

- చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ట్యూటర్‌కు రిమాండ్
- ఆన్‌లైన్ బెట్టింగ్‌లలో నష్టపోయిన నిందితుడు
- లోన్ యాప్‌ల నుంచి తీసుకున్న రుణాలు చెల్లించేందుకు చోరీల బాట
- ఏడు తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన 'పట్నం' పోలీసులు

ఇబ్రహీంపట్నం: ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కోసం చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న యువకుడు కటకటాలపాలయ్యాడు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం ఏసీపీ రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ నాగరాజు విలేకరులకు వెల్లడించారు. నల్లగొండ జిల్లా పెద్ద అడిసర్లపల్లి (పీఏపల్లి) మండలం వద్దిపట్ల గ్రామానికి చెందిన బొంత అనిల్(24) చంపాపేటలోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఎంఎస్సీ పూర్తి చేసిన ఇతను షాలిబండలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో ట్యూటర్‌గా పనిచేస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. లోన్ యాప్‌లలో అప్పు తీసుకుని ఆర్థికంగా నష్టపోయాడు. వీటి నుంచి గట్టెక్కేందుకు చైన్‌స్నాచింగ్‌ను ఎంచుకున్నాడు.

రెండు నెలల్లో రెండు చోరీలు

ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని శేరిగూడ గ్రామానికి చెందిన భారతమ్మ ఈనెల 4న పశువులు మేపుతుండగా.. ఆమె దగ్గరకు వెళ్లి నీళ్లు అడిగాడు. ఆ వెంటనే మెడలోని మూడు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కుని బైక్‌పై పరారయ్యాడు. సెప్టెంబర్ 17న పహాడీషరీఫ్ ఠాణా పరిధిలోని రావిర్యాల ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో ఓ మహిళ మెడలోంచి నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కొని బైక్‌పై ఉడాయించాడు.

నిందితుడిని పట్టించిన సీసీ ఫుటేజీ

ఇబ్రహీంపట్నం పరిధిలో చోరీకి పాల్పడిన వెంటనే పోలీసులు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. శేరిగూడ, మల్‌శెట్టిగూడ, రాందాసుపల్లి ప్రాంతాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడి బైక్ నంబర్ ఆధారంగా చంపాపేట వరకు వెళ్లినట్లు గుర్తించారు. చోరీ చేసిన బంగారాన్ని తనాఖా పెట్టేందుకు స్వగ్రామం వైపు వెళ్తున్న అనిల్‌ను మంగళ్‌పల్లి వద్ద పట్టుకున్నారు. అదుపులోకి తీసుకుని విచారించగా రెండు చోరీలు తానే చేసినట్లు అంగీకరించాడు. నిందితుడి నుంచి ఏడు తులాల బంగారు ఆభరణాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనిల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సీఐగా శ్రీనివాస్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ



శంకర్‌పల్లి: శంకర్‌పల్లి సీఐగా శ్రీనివాస్‌గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శంకర్‌పల్లిలో పనిచేసిన సీఐ బదిలీ కావటంతో ఆయన స్థానంలో శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించారు. బాధ్యతల స్వీకరించిన శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులోఉంటూ సమస్యల పరిష్కరిస్తానని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

కురుమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ



కొత్తూరు: కురుమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామానికి చెందిన ఎమ్మె సత్యనారాయణ నియమితులయ్యారు. సోమవారం హైద్రాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేశారని ఆయన తెలిపారు. సంఘం పటిష్టతకు శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన యాదయ్య

కేశంపేట: బంధువుల ఇంటి నుంచి తిరుగుప్రయాణమైన వ్యక్తి గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ శివారులో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామానికి చెందిన గొల్ల యాదయ్య పాపిరెడ్డిగూడలో అత్తగారింటికి వచ్చి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా.. వెలిజర్ల శివారులోని మైనింగ్ పరిశ్రమ నుంచి టిప్పర్లు అధికలోడ్‌తో వెళ్తుండడంతో గ్రామస్తులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని.. పోలీసు అధికారులు స్పందించి అధికలోడ్‌తో వెళ్తున్న వాహనాల రాకపోకలను అరికట్టాలని గ్రామస్తులు కోరారు.

బస్సు ఎక్కుతుండగా నగదు, నగలు చోరీ

షాద్‌నగర్‌రూరల్: బస్సు ఎక్కుతున్న మహిళ పర్సులోంచి నగలు, నగదు చోరీకి గురైన ఘటన షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శరత్ తెలిపిన ప్రకారం.. కేశంపేట మండలం చింతకొండపల్లి గ్రామానికి చెందిన అలివేలు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో జడ్చర్ల బస్సు ఎక్కింది. అయితే బస్సు ఎక్కుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అలివేలు పర్సులో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు, రూ.28వేల నగదును దోచుకెళ్లారు. ఈ విషయమై సోమవారం బాధితురాలు షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వాహన సేవ ఎదుట మహిళల కోలాటం

వేంకటేశ్వరుడికి వాహన సేవలు

చేవెళ్ల: మండల కేంద్రంలోని బాలాజీ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని సింహ వాహనపై ఊరేగించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతీ రోజు రాత్రి స్వామివారికి వాహన సేవలు నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు వామానాచార్యులు తెలిపారు.



సింహవాహనంపై వేంకటేశ్వర స్వామి ఊరేగింపు

అక్రమార్కుల ఆటకట్టు

కావలోనిబాయి తండా, తుమ్మలూరులో మట్టి తవ్వకాలు
- ఆరు వాహనాలు సీజ్
- ఎనిమిది మందికి రిమాండ్



కావలోనిబాయి తండా సమీపంలో అక్రమార్కుల తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

మహేశ్వరం: అసైన్డ్ భూమిలో అక్రమంగా తవ్వకాలకు పాల్పడుతూ మట్టిని తరలిస్తున్న మూడు ఇటాచీలు, మూడు టిప్పర్లను సీజ్ చేసి ఎనిమిది మందిని రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మహేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుమ్మలూరు, కావలోనిబాయి తండాలో సోమవారం చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. మహేశ్వరం పంచాయతీ పరిధిలోని కావలోనిబాయి తండాలో సర్వే నంబర్ 461లో ఉన్న అసైన్డ్ భూమిలో డబీల్‌గూడ గ్రామానికి చెందిన పి.ప్రసాద్, కావలోనిబాయి తండాకు చెందిన ఎం.పంతునాయక్ తవ్వకాలు చేపట్టి మట్టిని తరలిస్తున్నారు. తుమ్మలూరు గ్రామంలో సర్వే నంబర్ 315లో రాజమోని రమేశ్, మామిడిపల్లికి చెందిన జెటావత్ రవినాయక్, కందుకూరు చౌరస్తాకు చెందిన కాసుల వినోద్‌రెడ్డి, తుమ్మలూరుకు చెందిన జెనిగె ప్రశాంత్ యాదవ్, సరస్వతిగూడకు చెందిన ముఖేశ్, లేమూర్ గ్రామానికి చెందిన కడారి నాగార్జున మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఫిర్యాదు అందుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్వర్ణకుమారి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కావలోని బాయిలో ఓ ఇటాచీ, ఓ టిప్పర్, తుమ్మలూరులో రెండు ఇటాచీలు, రెండు టిప్పర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా తవ్వకాలు పాల్పడుతున్న ఎనిమిది మందిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐలు వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సైదులు హెచ్చరించారు. పట్టా రద్దు చేసి పీఓటీకి భూమిని ప్రభుత్వం సాధీనం చేసుకుంటుందన్నారు.

'ఐటీ' ట్రాఫిక్ నియంత్రణ ఎలా?

అధికారులతో సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ నియంత్రణ విషయంలో నెలకొన్న సమస్యలపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి, జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్... ఐటీ ఇండస్ట్రీ పెద్దలతో సమావేశమయ్యారు. సోమవారం జరిగిన సమావేశంలో హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోందని, ఇందుకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక పరిష్కారంపై చర్చించారు. అలాగే ఏ సమయంలో ఏ కంపెనీ ఉద్యోగులు ఎక్కువగా వస్తున్నారనే సమాచారం సేకరించిన తర్వాత అందుకు అనుగుణంగా.. షిఫ్ట్‌ల విషయంలో మార్పులు చేపట్టాలని, తద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చునని పలువురు సూచించారు. పెద్ద భవనాలకు కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను మానిటర్ చేస్తే బాగుంటుందని మరొకొందరు పేర్కొన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను ఉపయోగించి ట్రాఫిక్ మార్షల్స్ నియమించాలని మరికొందరు తెలిపారు. హైటెక్‌సిటీలో, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లో ప్రజారవాణాను మెరుగుపర్చడమే కాకుండా, పార్కింగ్ ఏర్పాట్లు, రాయదుర్గం మెట్రో స్టేషన్ వద్ద బస్ స్టాండ్, ఇమేజ్ టవర్ల నిర్మాణం చేపడితే ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం అవుతాయని వివరించారు. పాదచారుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించడం, ఐటీ పార్కుల్లో సెంట్రల్ ట్రాన్స్‌పోర్టేషన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సొసైటీ ఫర్ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ రమేశ్ ఖాజా, హైసియా ప్రెసిడెంట్ ప్రశాంత్ నాదెళ్ల తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర బెయిల్‌పై మెమో దాఖలు

జాతీయ అవార్డు రద్దుకావడంతో బెయిల్ ఉపసంహరించుకున్న జానీ మాస్టర్

రంగారెడ్డి కోర్టులు: లైంగికదాడి ఆరోపణల నేపథ్యంలో నృత్య దర్శకుడు జానీ మాస్టర్ చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. తనకు ఉత్తమ నృత్య దర్శకుడి అవార్డు వచ్చిందని, అవార్డు అందుకునేందుకు ఢిల్లీ వెళ్లాల్సి ఉన్నందున ఈ నెల 6నుంచి 10 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గత సోమవారం రంగారెడ్డి జిల్లా ప్రధాన పోక్సో కోర్టు కమ్ 9వ అదనపు జిల్లా కోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న కోర్టు గత గురువారం జానీ మాస్టర్‌కు ఈ నెల 6నుండి 9వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ తీర్పునిచ్చింది. కాగా జానీ మాస్టర్ అందుకోబోయే పురస్కారాన్ని రద్దు చేసినట్లు తెలియడంతో ఆయన తనకు మంజూరైన మధ్యంతర బెయిల్‌ను వినియోగించుకోబోనని కోర్టులో మెమో దాఖలు చేశాడు. ఇదిలా ఉండగా జానీ మాస్టర్ సాధారణ బెయిల్ పిటిషన్ బుధవారానికి వాయిదా పడింది.

57 ఉప కులాలను గ్రూప్ ఏలో చేర్చాలి

సాక్షి,సిటీబ్యూరో: ఎస్సీ సామాజిక వర్గంలోని 57 ఉప కులాలను గ్రూప్ ఏలో చేర్చాలని తెలంగాణ ఎస్సీ ఉపకులాల ఐక్యవేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం తెలంగాణ ఎస్సీ వర్గీకరణ కమిటీకి ఐక్యవేదిక నేతలు వినతి పత్రం అందజేశారు. సామాజికంగా విద్యా, ఉద్యోగ పరంగా వెనుకబడిన కులాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చింతల రాజలింగం, యాదయ్య, శంకర్, తులసీ రామ్, నూనె రాజు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి



శ్రీనివాస్(ఫైల్)

చేవెళ్ల: విద్యుదాఘాతంతో ఓ ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. ఈ ఘటన చేవెళ్ల ఠాణా పరిధిలోని న్యాలట సమీపంలోని సాంచురీ ఫాంహౌస్‌లో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని తలారం అనుబంధ గ్రామం దుద్దాగు గ్రామానికి చెందిన గూడెం శ్రీనివాస్(40) సాంచురీ ఫాంహౌస్‌లో మూడేళ్లుగా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగా విధులకు వెళ్లిన ఆయన విద్యుత్ పనులు చేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి కింద పడిపోయాడు. వెంటనే అక్కడున్న సిబ్బంది చేవెళ్ల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో చేవెళ్ల పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య శ్యామల, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబాన్ని ఫాంహౌస్ యాజమాన్యం ఆదుకోవాలని స్థానిక నాయకులు డిమాండ్ చేశారు. పేదింటి కుటుంబానికి చెందిన శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేయాలని యాజమాన్యాన్ని కోరగా వారు సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.

విద్యుదాఘాతానికి ఇద్దరు బలి

- మరో నలుగురికి గాయాలు
- కండ్లకోయలోని హెచ్‌యూఎల్ కంపెనీలో ఘటన



గుడుబైటా, పురో మృతదేహాలు

మేడ్చల్ రూరల్: బతుకుదెరువు కోసం వచ్చిన వలస కార్మికులు ఇద్దరు విద్యుదాఘాతానికి బలయ్యారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కండ్లకోయలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక హిందుస్థాన్ యూనీలివర్(హెచ్‌యూఎల్) లిమిటెడ్ కంపెనీ గత కొద్ది రోజుల క్రితం ఇక్కడ నుండి ఇతర ప్రాంతానికి తరలివెళ్లింది. దీంతో కంపెనీలో ఉన్న సామగ్రి తరలింపు పనులు చేపట్టారు. బీహార్ రాష్ట్రానికి చెందిన గుడుబైటా (26), పురో మంఝీ(25) మరికొందరు కార్మికులు మేడ్చల్ ప్రాంతానికి వలసవచ్చి ఓ కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో వీరిద్దరితో పాటు చోటా పాశ్వాన్, కరం కుమార్, లకిందర్ కుమార్, మరో కార్మికుడు మొత్తం ఆరుగురు కలిసి కంపెనీలో ఉన్న పొడవాటి ఇనుప నిచ్చెనను తీసుకెళ్తుండగా మెయిన్‌గేట్ సమీపంలో పై భాగంలో ఉన్న 11 కె.వి విద్యుత్ వైర్లను చూసుకోకపోవడంతో ఇనుప నిచ్చెనకు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో నిచ్చెనను పట్టుకున్న వారందరూ విద్యుదాఘాతానికి లోనయ్యారు. వీరిని చికిత్స నిమిత్తం సమీపంలో ఉన్న సీఎంఆర్ ఆస్పత్రికి తరలించగా తీవ్రంగా గాయపడ్డ గుడుబైటా, పురో మంఝీలు చికిత్స పొందుతూ మరణించారు. మిగతా నలుగురు గాయాలతో చికిత్స పొందుతున్నారు. ప్రమాద స్థలిని, క్షతగాత్రులను మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని ప్రమాదంలో మరణించిన ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

ఫుట్‌బాల్‌లో తృతీయ స్థానం



తృతీయస్థానంలో నిలిచిన జిల్లా జట్టు

కొత్తగూడెం టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా కొనసాగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్– 17 ఫుట్‌బాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. టోర్నీలో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు ప్రథమ, నల్లగొండ ద్వితీయ, రంగారెడ్డి తృతీయ స్థానంలో నిలిచాయి. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవానికి రాష్ట్ర ఫుట్‌బాల్ పరిశీలకుడు వడ్డెన్న ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 22 మందిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ జట్టు సభ్యులు జార్ఖండ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

నిర్మాణంలో ఉన్న పరిశ్రమలో హిటాచీ దగ్ధం

షాద్‌నగర్‌రూరల్: నిర్మాణంలో ఉన్న పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగి హిటాచీ దగ్ధమైంది. ఈ ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ బల్‌రాం తెలిపిన ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట శివారులోని ఐరన్ పరిశ్రమ ఎదుట నిర్మాణంలో ఓ పరిశ్రమలో రాత్రి 9.30గంటల ప్రాంతంలో ప్రమాదవశాత్తు హిటాచీకి మంటలు అంటుకున్నాయి. ఆ సమయంలో వాహనం పైన, సమీపంలో ఎవరు లేకపోడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ బల్‌రాం ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తుచేపట్టారు.

కూల్చివేతలకు బ్రేక్!

మూసీ బాధితులకు పునరావాసం, పరిహారం తర్వాతే ముందడుగు
- పరీవాహకంలో అతికష్టం మీద సగం ఇళ్లకే ఆర్‌బీ మార్క్
- ఖాళీ అయిన ఇళ్ల కూల్చివేత సైతం అంతంతే..
- అందుబాటులోఉన్న డబుల్ ఇళ్ల కేటాయింపు పూర్తి
- మిగతా వారి పరిస్థితేంటని అధికారుల తర్జనభర్జన
- మూసీ నిర్వాసితుల నుంచి తీవ్ర వ్యతిరేకత



సాక్షి, సిటీబ్యూరో: మూసీ పరీవాహకం పరిధిలోని నివాసాల కూల్చివేతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. మూసీ ప్రక్షాళనలో భాగంగా నదీగర్భం, బఫర్ జోన్‌లో గుర్తించిన నివాసాలకు పునరావాసం, పరిహారం అంశాలు తేల్చాకే కట్టడాల తొలగింపునకు ముందడుగు వేయాలని సర్కారు పెద్దల నుంచి మౌఖిక ఆదేశాలు అందడటంతో రెవెన్యూ యంత్రాంగం వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నదీ గర్భంలో సైతం రెడ్ మార్కింగ్ నిలిచిపోగా, నివాసాలు ఖాళీ చేసి డబుల్ బెడ్ రూమ్‌లకు తరలిన కుటుంబాల ఇళ్లను సైతం కొన్నింటిని మాత్రమే కూలీలతో కూల్చివేశారు. మిగతా కూల్చివేత పెండింగ్‌లో పడింది. కొన్ని ఉమ్మడి కుటుంబాలు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించినా..వెళ్లని పరిస్థితి నెలకొంది. ఇళ్ల కూల్చివేతలపై మూసీ పరీవాహకం పరిధిలోని నివాసితుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండడంతో అధికారులు ముందుకు వెళ్లేందుకు సాహసించడం లేదు. సర్కారు మాత్రం మూసీ ప్రక్షాళన తప్పనిసరి అని పేర్కొంటున్నా... నివాసితులకు పునరావాసం, పరిహారం ప్రధాన సమస్యగా తయారైంది.

ఆదిలోనే హంసపాదు

మూసీ ప్రక్షాళనకు ఆదిలోనే హంసపాదు ఎదురైందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. నదీ పరీవాహకం పరిధిలో సర్వే ద్వారా గుర్తించిన నివాసాలపై రెడ్‌మార్కింగ్ వేసేందుకు అధికార యంత్రాంగం చేసిన ప్రయత్నం బెడిసి కొట్టినట్లయింది. నివాసితుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురుకాగా, సగం ఇళ్లకు మాత్రమే రెడ్ మార్క్ వేసి వెనుకకు తగ్గక తప్పలేదు. మరోవైపు నివాసితులకు ప్రతిపక్ష పార్టీల మద్దతు పెరగడంతో వారు సైతం ఆందోళనలను ఉధృతం చేశారు. ఈ నేపథ్యంలో నదీగర్భంలో రెడ్‌మార్క్ వేసిన గృహాల జోలికి సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వాస్తవంగా పరీవాహక పరిధిలో 12,184 పైగా అక్రమ కట్టడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని రెండుగా వర్గీకరించి నదీగర్భం, బఫర్ జోన్లుగా విభజించారు. నదీగర్భంలో 2,166 నిర్మాణాలు ఉండగా, అందులో 288 భారీ నిర్మాణాలున్నాయి. నదీ సరిహద్దు నుంచి రెండు వైపులా 50 మీటర్ల వరకు గల బఫర్‌జోన్ పరిధిలో 7,851 ఆక్రమణలు, ఇందులో 1032 బడా నిర్మాణాలున్నట్లు అధికారులు గుర్తించారు. మిగతా పరిధిలో 3004 అక్రమ కట్టడాలున్నట్లు బయటపడింది.

పునరావాసంపై అయోమయం

మూసీ నదీ గర్భంలోని నివాసితులు పునరావాసం సమస్యగా తయారైంది. అధికార లెక్కల ప్రకారం 2166 డబుల్ బెడ్‌రూమ్‌లు అవసరం ఉంటుంది. అందులో హైదరాబాద్ జిల్లా పరిధిలో 1595, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలో 239, రంగారెడ్డి జిల్లా పరిధిలో 332 కుటుంబాలను పునరావాసం కల్పించాల్సి ఉంటుంది. జీహెచ్ఎంసీ పరిధిలోని 14 డబుల్ బెడ్‌రూమ్ సముదాయాల్లో మొత్తం మీద ఖాళీగా ఉన్న గృహాలు 500కు పైగా కూడా లేనట్లు తెలుస్తోంది. నివాసాలు ఖాళీ చేసిన సుమారు 10 శాతం కుటుంబాలకు పునరావాసం కల్పించగలిగారు. సైదాబాద్, హిమాయత్‌నగర్, నాంపల్లి మండలాల్లోని వివిధ బస్తీలు, కాలనీలకు చెందిన 193 మందిని మలక్‌పేటలోని పిల్లిగుడిసెలు, జియా గూడ, ప్రతాపసింగారం, జంగంమెట్‌లోని రెండు పడకల గృహసముదాయానికి తరలించారు. మిగతా వారికి పునరావాసంపై ఎలా అన్న ప్రశ్న తలెత్తుతోంది.